# వలిశెలు

ఏజన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు ముఖ్యమైన నూనెగింజల పంట వలిశెలు. మన రాష్ట్రంలో ఈ పంట 46,312 ఎకరాల్లో సాగు చేయబడుతూ సాలీన 7 వేల టన్నుల ఉత్పత్తి నిస్తున్నది. సరాసరి ఎకరా దిగుబడి 160 కిలోలు. గింజలో నూనె శాతం 45-50 వరకు వుంటుంది. ఈ నూనెను కేవలం వంటల్లోనే కాకుండా సబ్బులు, వార్నీషుల తయారీలోను, కందెనలుగాను, కాస్మొటిక్స్‌లలో విరివిగా వాడతారు. నూనెను తీయగా మిగిలిన పిండిని పశువుల దాణాగా, ఎరువుగా కూడా వాడుతారు. మనరాష్ట్రంలో ఈ పంటను ముఖ్యంగా విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, రంగారెడ్డి, మెదక్‌లోని కొన్ని ప్రాంతాలు మరియు ఏజన్సీ ప్రాంతాల్లో సాగు చేస్తున్నారు.

**విత్తే సమయం :** ఆగష్టు రెండవ పక్షం నుండి సెప్టెంబరు మొదటి పక్షం వరకు విత్తటానికి అనుకూలం. విత్తటం ఆలస్యం అయితే పూత, గింజకట్టు దశల్లో పైరు వర్షాభావానికి లోనై దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి.

**రకాలు**

**కె.జి.యన్. 2 :** 50 రోజుల్లో పూతకు వస్తుంది. 190 సెం.మీ. ఎత్తు పెరుగుతుంది. కాలపరిమితి 100-110 రోజులు. ఎకరాకు 4 క్వింటాళ్ళ దిగుబడినిస్తుంది. ప్రస్తుతం సాగులో వున్న దేశవాళీ రకం కంటె ఇది 40-50 శాతం ఎక్కువ.

**జి.ఎ.-10 :** ఎకరాకు 3-4 క్వింటాళ్ల దిగుబడినిచ్చి 110 రోజుల్లో కోతకొస్తుంది.

**నేలలు :** తేలికపాటి గరపనేలలు, కొండ వాలు భూములు, పోడు నేలలు, తేమ నిల్వ యుంచుకొని మురుగు నీరుపోయే వసతిగల అన్ని రకాల నేలలు అనుకూలం.

**నేల తయారి :** నేలను 2-3 సార్లు బాగా దున్ని మెత్తగా తయారుచేసి విత్తుకోవాలి.

**విత్తటం :** ఎకరాకు 5 కిలోల విత్తనం అవసరం. సాధారణంగా గిరిజన రైతులు విత్తనాలను నేలపై వెదజల్లి చెట్టు కొమ్మను నేలపై లాగి విత్తనాన్ని మట్టితో కలయబెడతారు. కాని వరుసల మధ్య 30 సెం.మీ. వరుసల్లోని మొక్కల మధ్య 10 సెం.మీ. దూరంతో విత్తితే దిగుబడులు బాగుంటాయి.

**ఎరువులు :** ఆఖరి దుక్కిలో ఎకరాకు 2.5 టన్నుల పశువుల ఎరువు వేయాలి. ఎకరాకు కనీసం 8 కిలోల నత్రజని యూరియా రూపంలో పంట విత్తిన 15-20 రోజుల్లో వేసినట్లయితే ఎకరాకు షుమారు 80 కిలోల వరకు అదనంగా దిగుబడి వచ్చి లాభదాయకంగా వుంటుంది.

**అంతరకృషి :** విత్తిన 15 రోజుల తర్వాత 10 రోజుల వ్యవధిలో 2 సార్లు కలుపు తీయాలి. ఆకాశపందిరి లేదా బంగారు తీగ (కస్కూటా) అనే సంపూర్ణ కాండ పరాన్నజీవి నాటిన నెల రోజుల్లో ఈ పంటను ఆశించి ఎక్కువగా నష్ట పరుస్తుంది. ఇది నేలలో పడిన విత్తనం ద్వారా, వలిశెల విత్తనాల్లో బంగారుతీగ విత్తనాలు కలియడం ద్వారా వ్యాప్తి చెందుతుంది. కాబట్టి వలిశెల విత్తనాలను జల్లెడతో (0.85-1.00 మి.మి.) జల్లించి ఆకాశ పందిరి విత్తనాలను వేరు చేయాలి లేదా ఒక ఎకరాకు కావలసిన 5 కిలోల విత్తనాన్ని 20 లీటర్ల నీటికి 3 కిలోల ఉప్పు కలిపి ఆ ద్రావణంలో వేసి బాగా కలియబెట్టినట్లయితే ఆకాశ పందిరి విత్తనాలు అడుగుకు, వలిశెల విత్తనాలు నీటి పైభాగానికి చేరతాయి. ఈ విధంగా పై భాగానికి చేరిన వలిశెల విత్తనాలను పైకి తీసి మంచి నీటితో మరోసారి శుభ్రం చేసి పొడిగుడ్డపై ఆరబెట్టి వెంటనే భూమిలో చల్లినట్లయితే జల్లెడ పట్టటానికయ్యే కూలీల ఖర్చును ఆదాచేయవచ్చు. అదే ఉప్పు నీటిద్రావణాన్ని మరల వాడుకోవచ్చు. పొలంలో ఆకాశపందిరి పూత దశకు రాకముందే పీకి వేసి గుంతలో పూడ్చటం లేదా తగలబెట్టటం వలన కూడా దీని ఉధృతిని తగ్గించవచ్చు.

**కలుపు నివారణ :** ఎకరాకు 1.3 లీటర్ల పెండిమిథాలిన్ అనే కలుపు నాశని మందును విత్తనం చల్లిన వెంటనే నేలపై పిచికారి చేసినట్లయితే నేలలో ఉండే విత్తనం ద్వారా వ్యాప్తి చెందే ఆకాశ పందిరిని సమర్ధవంతంగా నివారించవచ్చు.

## సస్యరక్షణ

ఈ పంటకు పురుగులు, తెగుళ్ళ బెడద చాలా తక్కువ. అయితే, ఏజన్సీ ప్రాంతంలో పొగాకు లద్దె పురుగు వాతావరణ పరిస్థితులను బట్టి అడపాదడపా ఆశించే అవకాశం ఉంది.

### పురుగులు

**పొగాకు లద్దె పురుగు :** గుడ్ల నుండి వెలువడిన లద్దె పురుగులు ఆకులను విపరీతంగా తిని, ఆకులు లేకుండా చేస్తాయి. పూత తగ్గిపోయి, గింజ కట్టదు. దిగుబడి తగ్గుతుంది. నివారణకు ఎండోసల్ఫాన్ లీటరుకనీటికి 2 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**పేనుబంక, దీపపు పురుగులు :** తల్లి, పిల్ల పురుగులు ఆకుల్లోని రసాన్ని పీల్చివేస్తాయి. మొక్క ఎదుగుదల తగ్గిపోతుంది. పూత మరియు గింజ కట్టడం బాగా దెబ్బతింటుంది. వీటి నివారణకు గాను ఫాస్ఫామిడాన్ మందును లీటరు నీటికి 1 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చెయ్యాలి.

### తెగుళ్ళు

**ఆకుమచ్చ కుళ్ళు :** ఆకులపైన చిన్నచిన్న గుండ్రని గోధుమ రంగు మచ్చలు ఏర్పడుతాయి. గాలిలో తేమశాతం ఎక్కువైనప్పుడు ఈ మచ్చలు పెద్దవై ఒక దానితో ఒకటి కలిసి ఆకులు ఎండి రాలుతాయి. గింజ కట్టదు. తెగులు కలుగ జేసే శిలీంద్రాలు గింజ మీద మరియు కోత తరువాత మిగిలిన ఆకులు, మోళ్ళ పైన ఉండటం వలన, వాతావరణ అనుకూలతను బట్టి పంట ఏ దశలోనైన తెగులు ఆశించవచ్చు. వీటి నివారణకు జినెబ్ లేదా మాంకోజెబ్ మందును లీటరు నీటికి 2.5 గ్రా. వంతున కలిపి చల్లాలి.

**బూడిద తెగులు :** విత్తిన 35-40 రోజుల తరువాత గాలిలో తేమ శాతం ఎక్కువగా వున్నప్పుడు ముదురు ఆకులపై బూడిద రంగులో చిన్న చిన్న మచ్చలు కనబడతాయి. ఆకంతట వ్యాపించటం వలన ఆకులు రాలిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి డైనోకాప్ 1 మి.లీ. వంతున కలిపి తెగులు కనిపించిన వెంటనే ఒకసారి పిచికారి చెయ్యాలి.

**పంటకోత :** పంట 100-110 రోజుల్లో కోతకొస్తుంది. మొక్కలను నేల మట్టం వరకు కోసి ఎండలో ఆరబెట్టి, కట్టెలతో కొట్టి గింజలను వేరు చేయాలి. తర్వాత గింజలను 8-10 రోజుల వరకు ఎండలో ఆరబెట్టి బస్తాల్లో నిల్వచేయాలి.

వలిశెల సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా :

**"ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ (సెసేమ్ & నైజర్), జె.యన్. కృషి విశ్వవిద్యాలయ, జబల్‌పూర్ - 482 004, (యం.పి.) మధ్యప్రదేశ్".** ఫోన్ నెం. ఆఫీస్ & ఫాక్స్ : 0761-2481050, 2480254, ఇంటి నెం. 0761-2360829

లేదా

**"అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసర్చ్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, చింతపల్లి - 531 111, విశాఖపట్నం జిల్లా",** ఫోన్ నెం. : 08937-238244